
సాక్షి ఒడిశా
ఆదివారం ၊ 19 ၊ మార్చి ၊ 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం శనివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,90,628లు, బంగారం 1.2 గ్రాములు, వెండి 99గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- రాయగడలో మూడో రోజుకు ఉగాది పోటీలు

- 8లో



త్వరలో ఉత్కళ విమానాశ్రయం

- 8లో

న్యూస్‌రీల్

యూనియన్ బ్యాంకు నూతన భవనం ప్రారంభం



కొత్త భవనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రాయగడ: పట్టణంలోని కపిలాస్ రోడ్డు సమీపంలో యూనియన్ బ్యాంకు నూతన భవనం శనివారం ప్రారంభమైంది. బ్యాంకు ఫీల్డ్ జనరల్ మేనేజర్ సర్వేష్ రంజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇప్పటి వరకు ఈ బ్యాంకు లావాదేవీలు న్యూకాలనీలో కొనసాగుతుండేవి. ఏడు జిల్లాల్లో 48శాఖల పర్యవేక్షణ ఇకపై స్థానిక కార్యాలయం నుంచే కొనసాగుతాయి. కార్యక్రమంలో ప్రాంతీయ మేనేజర్ తపన్‌కుమార్, మేనేజర్ కేవీ కృష్ణప్రియ, ఇప్పిలి సన్యాసిరాజు, వ్యాపారులు పాల్గొన్నారు.

అమ్మకు ఆహ్వానం



అర్చకులకు ఆహ్వాన పత్రికను అందిస్తున్న దృశ్యం

రాయగడ: పట్టణంలోని తేజస్వినీ హోటల్ వద్ద మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు ఆధ్వర్యంలో ఈనెల 22, 23 తేదీల్లో ఉగాది ఉత్సవాలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి తొలి ఆహ్వాన పత్రికను పట్టణ ప్రజల ఇలవేల్పు మజ్జి గౌరమ్మకు సమర్పించారు. ఉత్సవ కమిటీ కోశాధికారి ఇప్పిలి సన్యాసిరాజు, సభ్యులు గొర్లె అప్పారావు, సీర రవణ, బనాఘటి తిరుపతి రావు, తుబాటి రాము తదితరులు పాల్గొన్నారు.

వీకే పాండ్యన్‌కు వినతి



విమానాశ్రయం వద్ద పాండ్యన్‌తో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

జయపురం: స్థానిక జగజ్జననీ మందిర పరిచాలన కమిటీ సభ్యులు రాష్ట్రప్రభుత్వ 5టీ కార్యదర్శి వీకే పాండ్యయన్‌ను శనివారం కలిశారు. నవరంగపూర్ జిల్లా పర్యటనకు వెళ్తున్న ఆయన.. ముందుగా జయపురానికి ప్రత్యేక విమానంలో చేరుకున్నారు. ఆ ఈ సందర్భంగా మందిర కమిటీ సభ్యులు ఆయనను కలిసి, వినతిపత్రం అందించారు. జయపురం ప్రజల ఆరాధ్య దైవమైన జగజ్జననీ మందిరాన్ని అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం తరపున సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు రామారావు, మానసరెడ్డి, ప్రకాశ ఆచారి, లక్ష్మణ జానీ, అర్చకులు వల్లభ నారాయణ షాడంగి తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీని ఢీకొన్న ఆటో



ఆటో ఢీకొనడంతో కూలిన గోడ

భువనేశ్వర్: ప్రమాదావశాతు పాఠశాల ప్రహరీని ఆటో ఢీకొన్న ఘటనలో మెట్రిక్ విద్యార్థులు, ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయపడ్డారు. రాజ్‌ఘాట్–జలేశ్వర్ మార్గంలో మహిళను రక్షించేందుకు చేసిన ప్రయత్నంలో వాహనం అదుపు తప్పడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. శనివారం 10వ తరగతి పరీక్షకు హాజరై విద్యార్థులతో తిరిగి వస్తున్న ఆటో బోల్తా పడింది. అందులోని ముగ్గురు విద్యార్థులు, వృద్ధురాలు తీవ్రంగా గాయపడ్డారు. వీరందరినీ సమీపంలోని ఏకే భట్ ఆస్పత్రిలో చేర్చారు. బాధితులు జలేశ్వర్ సరస్వతి శిశు విద్యామందిర్‌కు చెందని విద్యార్థులుగా గుర్తించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

తప్పెవరిది?



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

- మెట్రిక్ ప్రశ్న పత్రంలో తప్పులు
- అయోమయంలో విద్యార్థులు
- ఓఎంఆర్‌లో 49 ప్రశ్నలకే సమాధానం

భువనేశ్వర్: రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు(బీఎస్ఈ) ఆధ్వర్యంలో జరుగుతున్న మెట్రిక్యులేషన్ పరీక్ష పత్రం తప్పులు తడకలతో విద్యార్థులకు పంపిణీ చేశారు. అయోమయంలో దిక్కుతోచని స్థితిలో విద్యార్థులు నెత్తిన చేతులేసుకున్నారు. శనివారం జరిగిన సోషల్ సైన్స్ ప్రశ్న పత్రంలో తప్పులు దొర్లడంతో విద్యార్థులు అయోమయం, ఆందోళనకు గురయ్యారు. సెట్ ఏ ప్రశ్న పత్రం నుంచి అనేక ప్రశ్నలు సెట్ బిలో ఉండటంతో విద్యార్థులు కలవర పడ్డారు. కొన్ని కేంద్రాల్లో విద్యార్థులు ఈ తికమకను స్పష్టంగా గుర్తించి, పరీక్ష నిర్వాహకుల దృష్టికి తీసుకుని వెళ్లారు. అలాగే ఆబ్జెక్టివ్ ప్రశ్న పత్రంలో 19వ ప్రశ్న అదృశ్యమైంది. దీంతో 50 ప్రశ్నలకు జవాబు రాయాల్సిన విద్యార్థులు ఓఎంఆర్ షీట్‌లోని 49 ప్రశ్నలకు మాత్రం జవాబు రాసినట్లు విద్యార్థులు తెలిపారు.

విద్యార్థుల అభ్యర్థన..

ప్రశ్న పత్రంలో తప్పులు తడకలకు తామెంత మాత్రం బాధ్యులు కామని, మార్కుల కేటాయింపులో ఎటువంటి అన్యాయం జరగకుండా జాగ్రత్త వహించాలని విద్యార్థుల వర్గం బోర్డు అధికార వర్గాలకు అభ్యర్థించింది. బోర్డు నిర్ణయం పట్ల విద్యార్థి వర్గం కలవర పడుతోంది. జవాబు పత్రాల మూల్యాంకనంలో విద్యార్థులకు అన్యాయం జరగకుండా ముందస్తుగా న్యాయ సమ్మతమైన మార్గదర్శకాలు జారీ చేయాలని తెలిపారు. మార్కుల తొలగింపు లేదా కోత జరిగితే తమ ఉత్తీర్ణత ఫలితాలు తలకిందులయ్యే ప్రమాదం ఉంటుందని వాపోయారు.

అచ్చు తప్పు: బోర్డు

ప్రశ్న పత్రంలో తప్పులను బోర్డు గుర్తించింది. ముద్రణ తప్పిదంతో ఈ పరిస్థితి చోటు చేసుకుంది. దీని పట్ల విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సరైన మూల్యాంకనానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు అధ్యక్షుడు రమాశిష్ హజ్రా తెలిపారు. సమస్యను ఎదుర్కొన్న విద్యార్థుల సమగ్ర జాబితాను తక్షణమే దాఖలు చేయాలని పరీక్షా కేంద్రాల అధికార వర్గాలకు బోర్డు ఆదేశించింది. ఈ సమాచారం ఆధారంగా ఓఎంఆర్ షీట్ల మూల్యాంకనం కోసం సిద్ధం చేసిన ప్రోగ్రామ్ తదనుగుణంగా మార్చబడుతోంది. మళ్లీ పరీక్ష నిర్వహించాల్సిన అవసరం లేదన్నారు. బోర్డు నిర్ధారిత ప్రామాణికత ఖరారు చేసి ప్రశ్న పత్రంలో తప్పుల ప్రభావం మార్కుల కేటాయింపులో పునరావృతం కాకుండా మూల్యాంకనం పారదర్శంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.



కిక్కిరిసిన అమ్మవారి ఆలయ ప్రాంగణం

ఏప్రిల్ 4 నుంచి శాంతమ్మ సంబరాలు



ప్రత్యేక అలంకరణలో మాబుడి శాంతమ్మ

- దేశీబెహరా వీధిలో అర్ధరాత్రి శుభరాట స్థాపన
- మే 1వరకు కొనసాగనున్న ఉత్సవాలు



తాత్కాలిక మందిరంలో పూజలు చేస్తున్న దేశీ బెహరా

బరంపురం: ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే రాష్ట్రప్రభుత్వ అధికార ఉత్సవాలు మాబుడి శాంతమ్మ సంబరాలు ఏప్రిల్ 4నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి స్థానిక దేశీ బెహరా వీధిలో అమ్మవారి తాత్కాలిక మందిర ప్రాంగణంలో సంబరాల నిర్వహకులు పాతర్ల దుర్గాప్రసాద్ దేశీ బెహరా సారథ్యంలో వేద పండితులు వేమకోటి సిద్ధాంతి రాజేశ్వరశాస్త్రి, వేమకోటి వాసుదేవ్‌శాస్త్రి పంచాగాన్ని పరిశీలించారు. అనంతరం శాంతమ్మ వారి సంబరాలను ఏప్రిల్ 1నుంచి మే 1వరకు నిర్వహించేందుకు నిర్ణయించారు. మొత్తం 28 రోజులు జరగనున్నట్లు సంబరాల నిర్వహకులు పాతర్ల దుర్గాప్రసాద్ దేశీబెహరా వెల్లడించారు. అనంతరం వేద మంత్రాలు, బాజా భజంత్రీలు, మంగళ వాయిధ్యాల మధ్య దశాబ్దాల సంప్రదాయం ప్రకారం అమ్మవారి సమక్షంలో శుభరాటను స్థాపించారు. అక్కడి నుంచి వేలాది మంది భక్తులు వెంటరాగా.. నగర ప్రముఖులంతా కలిసి తాత్కాలిక మందిర ప్రాంగణంలోని శుభరాటకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విక్రమ్ పండా, నగర మేయర్ సంఘమిత్ర దొళాయి, బీడీఏ చైర్మన్ సుభాష్ మహరణా, బీఎంసీ కార్పొరేటర్లు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.



సంబరాల శుభరాటను స్థాపిస్తున్న దేశీబెహరా కుటుంబీకులు

జనజీవనంలో మమేకమై..



చిన్నారులతో సహపంక్తి భోజనం చేస్తున్న 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్



కార్యకర్త ఇంట్లో సహపంక్తి భోజనం చేస్తున్న బబిదాస్, ఎంపీ రమేష్, ఎమ్మెల్యే

కొరాపుట్: రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు అత్యంత సన్నిహితులైన ఇద్దరు సలహాదారులు జన జీవనంలో మమేకమయ్యారు. 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్ నవరంగ్‌పూర్ జిల్లా కేంద్రం సమీపంలోని టిర్లి అంబాగుడ గ్రామంలో ఉన్న అన్వేష ప్రభుత్వ వసతి గృహాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి చిన్నారులతో ముచ్చటించారు. అనంతరం వారితో సహపంక్తి భోజనం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంలో అత్యంత ప్రధాన వ్యక్తి తమతో అలా గడపడం చిన్నారుల్లో ఆనందం వెల్లివిరిసింది. మరోవైపు అధికార బీజూ జనతాదళ్ పార్టీలో ముఖ్యమంత్రి సలహాదారుడు బబిదాస్ శనివారం నవరంగ్‌పూర్ జిల్లా సింధిగుడ గ్రామంలో పర్యటించారు. అక్కడి గిరిజన మహిళలతో సంభాషించారు. సాధారణ కార్యకర్త నివాసంలో భోజనం చేశారు. కార్యక్రమంలో నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్ మాఝి, ఎస్‌డీసీ సలహాదారుడు ప్రదీప్ మాఝి, ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్, పార్టీ జిల్లా పరిశీలకుడు దేవాశిష్ పాల్గొన్నారు. అంతకుముందు జిల్లా కేంద్రంలో పాండ్యన్ ప్రజా వినతులు స్వీకరించారు. ఇరువురూ జిల్లావ్యాప్తంగా ప్రార్థనా స్థలాలు, పర్యటక ప్రాంతాలు వేర్వేరుగా పర్యటించి నిధుల సహాయం కోసం హామీ ఇచ్చారు.

కాసీపూర్‌లో

వడగళ్ల వర్షం



ఆసక్తిగా వడగళ్లు సేకరిస్తున్న యువకుడు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి డి–కారోల్, పాపోసాగుడ, కొంజాకోన తదితర ప్రాంతాల్లో శనివారం సాయంత్రం వడగళ్ల వాన కురిసింది. అకాల వర్షం కారణంగా దారంతా వడగళ్లతో నిండిపోయింది. మరికొన్ని చోట్ల చెట్లు నేలకొరిగాయి. పూరి గుడిసెలపై చెట్లు కూలిపోవడంతో ఇంటి పైకప్పులు దెబ్బతిన్నాయి.

సుందరంగా ఉపేంద్ర భంజ్ ఇనిస్టిట్యూట్




ప్రారంభోత్సవంలో పూజలు చేస్తున్న ఈకో జీఎం మనోజ్ శర్మ

- ప్రారంభించిన ఈస్టుకోస్టు రైల్వే జీఎం మనోజ్ శర్మ

భువనేశ్వర్: స్థానిక మంచేశ్వర్ రైల్వే కాలనీ ప్రాంగణంలోని ఉపేంద్ర భంజ్ రైల్వే ఇనిస్టిట్యూట్‌ను నవీకరించారు. ఈ భవన సముదాయాన్ని తూర్పుకోస్తా రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంప్రదాయ పూజాదుల్లో ఆయనతో తూర్పుకోస్తా రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రమేష్‌చంద్ర సాహు, ఇతర అధికారులు పాల్గొన్నారు. సిబ్బంది సంక్షేమ కార్యకలాపాల్లో భాగంగా ఉపేంద్ర భంజ్ రైల్వే ఇనిస్టిట్యూట్ నవీకరించినట్లు జనరల్ మేనేజరు తెలిపారు. ఇందులో భాగంగా ఈ సంస్థలో ఎయిర్ కండిషన్ సదుపాయంతో కూడిన ఆడిటోరియం, ఇండోర్ క్రీడలు, మనోరంజక కార్యకలాపాల కోసం ప్రత్యేక సదుపాయాల గదులను విస్తరించినట్లు పేర్కొన్నారు. సిబ్బంది కుటుంబీకుల ఆటపాటలు, వివాహాది శుభ కార్యాలకు ఈ సముదాయం వినియోగ పడుతుందన్నారు.

కలసికట్టుగా నల్లధనాన్ని అడ్డుకోవాలి

- సిట్ ఉపాధ్యక్షుడు జస్టిస్ అరజిత్ పషాయత్
- నల్లధనం నియంత్రణపై సిట్ తొమ్మిదో సమావేశం



జస్టిస్ అరజిత్ పషాయత్





సిట్ సమావేశానికి వస్తున్న ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు

భువనేశ్వర్: 'నల్లధనంతో మాదక ద్రవ్యాలు, రియల్ ఎస్టేట్, బంగారం వ్యాపారాలు పుంజుకుంటున్నాయి. ఈ పరిస్థితులు కలకలం రేపుతున్నాయి. అన్ని శాఖలు సమన్వయంతో కలసి కట్టుగా కృషి చేసి నల్లధనం ప్రాబల్యానికి కళ్లెం వేయాల'ని నల్లధనం ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ ఉపాధ్యక్షుడు జస్టిస్ అరజిత్ పషాయత్ ఆదేశించారు. ఆయన అధ్యక్షతన సిట్ తొమ్మిదో సమావేశం శనివారం కటక్‌లో జరిగింది. దేశంలో మాదక ద్రవ్యాలు(డ్రగ్స్) అక్రమ రవాణా ఆందోళనకరంగా మారిందన్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున గంజాయి పట్టుబడుతుండగా బ్రౌన్ షుగర్, హెరాయిన్ కూడా పట్టుబడుతున్నాయని గుర్తుచేశారు. రాష్ట్రంలో గంజాయి వ్యాపారం కలకలం రేపిందని, ఈ నేపథ్యంలో దర్యాప్తు సంస్థలకు సవాళ్లు పెరిగాయని తెలిపారు. అవినీతి నిరోధక కేసుల సమగ్ర సమాచారాన్ని ఈడీ మరియు ఆదాయ పన్ను (ఐటీ) విభాగానికి తెలియజేయాలని జస్టిస్ పషాయత్ సిట్ సభ్యులకు ఆదేశాలు జారీ చేశారు. దేశంలో ద్రవ్య సేవా పన్ను(జీఎస్టీ) మోసాలు పెరిగిపోతున్నాయని, సమన్వయంతో అనుబంధ శాఖలు ఈ చర్యలకు అడ్డుకట్ట వేయాలని పేర్కొన్నారు. అవినీతి నిరోధానికి అన్ని శాఖలు కృషి చేయాలన్నారు. నల్లధనానికి సంబంధించి వివిధ శాఖల నుంచి నివేదికలు అందాయని, దీనికి సంబంధించి జూన్ లోగా సిట్ సుప్రీం కోర్టుకు నివేదిక ఇవ్వనుందని వివరించారు.

అర్చన నాగ్ ఆస్తులు జప్తు..

కరుడుగట్టిన లేడీ బ్లాక్ మెయిలర్ అర్చన నాగ్ అక్రమాల కేసుకు సంబంధించిన సమాచారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దగ్గర ఉందని సిట్ ఉపాధ్యక్షుడు జస్టిస్ పషాయత్ తెలిపారు. నాగ్ పేరిట ఉన్న రూ.4 కోట్ల విలువైన అక్రమ ఆస్తులను పబ్లిక్ ప్రాసిక్యూషన్ సర్వీస్ అటాచ్ చేసిందని ప్రకటించారు. ప్రస్తుతం కేసు కోర్టులో ఉండగా, అర్చనకు ఈ ఆస్తి ఎక్కడి నుంచి వచ్చిందనే కోణంలో దర్యాప్తు జరుగుతోందన్నారు. సమావేశానికి ప్రాసిక్యూషన్, ఆదాయపు పన్నుశాఖ, సీబీఐ, కస్టమ్స్, ఎక్సైజ్, నార్కోటిక్స్, డైరెక్ట్ ట్యాక్స్, ఒడిశా పోలీస్, క్రైంబ్రాంచ్ ఈడబ్ల్యూ అధికారులు హాజరయ్యారు.

పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన



బరంపురం: నగర శివారు సిద్ధార్థ విహార్‌లో కేసు దర్యాప్తుపై వెళ్లిన దుండగులు బాంబులతో దాడిచేసిన ఘటనలో ఇద్దరు మహిళలతో సహా 10దుండగులను నిమ్మఖండి పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం మరో వర్గానికి చెందిన పుల్బా గ్రామస్తులు నిమ్మఖండి పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామంపై బాంబుల దాడి చేసిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే తమకు రక్షణ కల్పించాలని కోరారు.

పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న పుల్బా గ్రామస్తులు

క్లుప్తంగా

జగబంధు దాస్‌కు సత్కారం



జగబంధు దాస్‌ను సత్కరిస్తున్న తిరుపతి పాణిగ్రాహి, నాయకులు

పర్లాకిమిడి: బీజేడీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన జగబంధు దాస్‌ను గుమ్మా బ్లాక్ సంతోపేట వద్ద పార్టీ సమితి అధ్యక్షుడు అగస్టస్ గమాంగో ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. హాజరైన బీజేడీ సీనియర్ నాయకులు తిరుపతి పాణిగ్రాహి.. దాస్ నాయకత్వంలో రానున్న ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాల్లో విజయం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రూపేష్ పాణిగ్రాహి, బ్లాక్ అధ్యక్షురాలు సునేమీ మండళ్, బీజేడీ రాష్ట్ర కార్యదర్శి మారుత్ పాలో, బసంత్ దాస్, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీకాంత పారిచ్చా, జి.విజయ కుమార్, సర్పంచులు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యం



వాహనచోదకులకు ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

విజయనగరం టౌన్: రోడ్డు ప్రమాదాల నియంత్రణే లక్ష్యంగా పోలీస్‌శాఖ కృషిచేస్తోందని ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు పేర్కొన్నారు. రోడ్డు నిబంధనలపై విజయనగరం ఎత్తుబ్రిడ్జి వద్ద వాహనచోదకులకు శనివారం అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు లోవరాజు, దామోదర్, ఏఎస్‌ఐ నాగాదిత్య, నూకరాజు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

రామభద్రపురంలో భారీ వర్షం



రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

రామభద్రపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రామభద్రపురంలో శనివారం మధ్యాహ్నం భారీవర్షం కురిసింది. 34 మిల్లీమీటర్ల వర్షం కురవడంతో పల్లపు భూములు చెరువులను తలపించాయి. జాతీయ రహదారి పక్కన ఉన్న మురుగునీటి కాలువలు ఆక్రమణలకు గురికావడంతో వర్షపు నీరుపోయే మార్గం లేక పశువైద్యశాల ప్రాంగణంలోకి చేరింది. రోడ్లపై వర్షపు నీరు ప్రవహించడంతో ప్రజలు, వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

సకాలంలో ఆస్పత్రికి చేర్చాలి



అంబులెన్సులో రికార్డులు పరిశీలిస్తున్న అప్పలరాజు

విజయనగరం ఫోర్ట్: ఆపదవేళ రోగులను సకాలంలో ఆస్పత్రికి తరలించాలని 108 సిబ్బందిని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఉప్పు అప్పలరాజు ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆవరణలో 108 అంబులెన్సును శనివారం ఆయన పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. రోగులు కోరుకున్న ఆస్పత్రిలో చేర్పించాలని సూచించారు.

తాత్కాలిక కోర్టు భవనం ప్రారంభం

కొత్తవలస: మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు తాత్కాలిక భవనాన్ని జిల్లా జడ్జి బి.సాయికళ్యాణచక్రవర్తి శనివారం ప్రారంభించారు. ప్రస్తుతం ఉన్న కోర్టు భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో జూనియర్ సివిల్‌జడ్జి నివాస సముదాయాన్ని కోర్టు హాల్‌గా మార్చారు. శిథిలమైన కోర్టు భవనం స్థానంలో కొత్తభవనం నిర్మాణానికి హైకోర్టు అనుమతులు మంజూరు చేసిందని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణ్‌శ్రీ తెలిపారు. అప్పటి వరకు తాత్కలికంగా ఏర్పాటు చేసిన భవనంలో కోర్టు కార్యకలాపాలను నిర్వహిస్తామన్నారు. అనంతరం లక్కవరపుకోట మండలం రేగ గ్రామంలోని వేదమాత గాయిత్రీదేవి ఆలయాన్ని జిల్లా జడ్జి సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు ఏఓ ఎం.కామేశ్వరరావు, సెంట్రల్ నాజర్ పి.రామచంద్రరావు, కొత్తవలస బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్, కార్యదర్శి కొట్యాడ అచ్చిబాబు, సీనియర్ న్యాయవాదులు సీహెచ్ రామచంద్రప్రసాద్, కె.రాజారావు, గొడుగుల మహేంద్ర, ఎం.వి.ఎస్.గిరిబాబు పాల్గొన్నారు.



ఉగాది క్వీన్ విజేతను ప్రకటిస్తున్న న్యాయనిర్ణేతలు



ఉత్సాహంగా సాగుతున్న వన్ మినిట్ షో

ఉల్లాసంగా... ఉత్సాహంగా

- రాయగడలో మూడో రోజుకు ఉగాది పోటీలు
- ఆసక్తిగా పాల్గొన్న మహిళలు



పోటీలను ప్రారంభిస్తున్న చంద్రమౌళి కుముందాన్, పక్కన నెక్కంటి, బిడిక



విజేతలతో నిర్వాహకులు



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

రాయగడ: పట్టణంలోని తేజస్విని హోటల్ ఎదురుగా ఉన్న మైదానంలో జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ నిర్వహిస్తున్న వివిధ పోటీల్లో మహిళలు ఉల్లాసంగా పాల్గొంటున్నారు. శుక్రవారం సాయంత్రం ఉగాది క్వీన్, వన్ మినిట్ షో, సంప్రదాయ వంటల పోటీలు జరిగాయి. తెలుగు సంప్రదాయ వంటకాల్లో భాగంగా పులిహోర, చంద్రకాంతులు, బూరెలు, గారెలు తదితర పిండివంటలు ఈ ప్రదర్శనలో చోటు చేసుకున్నాయి. ఈ పోటీల్లో ఒడియా అతివలు కూడా వారి సంప్రదాయ వంటకాలతో పాల్గొనడం విశేషం. ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు చంద్రమౌళి కుముంధాన్ మాట్లాడుతూ రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు ఇంత భారీగా నిర్వహిస్తుండటం తెలుగు వారి ఐఖ్యతకు ప్రతీకగా పేర్కొన్నారు. ఇదే ఉత్సాహంతో జిల్లాలోని తెలుగు వారంతా ఏకతాటిపై నడిచి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. రాయగడ మజ్జిగౌరి మందిరం మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక మాట్లాడుతూ ఉగాది ఉత్సవాలకు ఇంతటి స్పందన లభించడం హర్షించదగ్గ విషయమన్నారు.

విజేతల వివరాలు..

సంప్రదాయ వంటల పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి 185మంది మహిళలు పాల్గొన్నారు. ఇందులో పి.నాగమణి ప్రథమ, ఎం.సుజాత, వి.ఇందిర ద్వితీయ, జి.శ్రీసుధ, ఎం.లక్ష్మీ తృతీయ బహుమతులు దక్కించుకున్నారు. అదేవిధంగా రంజిత బౌరి, ఎస్.రమాదేవి ప్రోత్సాహక బహుమతి దక్కించుకున్నారు. ఉగాది క్వీన్ పోటీల్లో 60మంది మహిళలు పాల్గొనగా.. ఇందులో నిరంజని చింతపల్లి గెలుపొందారు. వన్ మినిట్ షోలో 123మంది మహిళలు పాల్గొనగా ఎస్.బిందు, పద్మాలయ మిశ్రా, సస్మిత పాఢి వరుస స్థానాల్లో నిలిచారు. విజేతలకు ఉగాది వేదిక వద్ద బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. పోటీలకు బి.నాగరాజు, కృష్ణప్రియ, బాబురావు మహంతి, సత్యనారాయణ, రుబిరాణి కుండు, వెల్లంకి గౌరీజయంతి, న్యాయవాది ప్రణతి పాత్రొ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

త్వరలో ఉత్కేళ విమానాశ్రయం



విమానాశ్రయం పర్యవేక్షిస్తున్న డీజీసీఏ బృందం

భువనేశ్వర్: కలహండి జిల్లా భవానీపట్నలో ఉత్కేళ విమానాశ్రయంలో విమానాల రాకపోకలను ప్రారంభించేందుకు చురుగ్గా చర్యలు చేపడుతున్నారు. 2-బీ కేటగిరీ ఉత్కేళ విమానాశ్రయం నుంచి విమాన కార్యకలాపాలకు లైసెన్సులు జారీ చేయాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ)ను కొన్ని నెలల క్రితం అభ్యర్థించారు. ఈ నేపథ్యంలో డీజీసీఏకు చెందిన ఐదుగురు సభ్యుల బృందం శుక్రవారం భవానీపట్న విమానాశ్రయాన్ని సందర్శించింది. ఈ బృందం ఉత్కేళ విమానాశ్రయాన్ని తనిఖీ చేసి భవానీపట్న-భువనేశ్వర్ మధ్య విమాన కార్యకలాపాల ప్రతిపాదనపై అనుబంధ వర్గాలతో సమీక్షా సమావేశం నిర్వహించింది. గతంలో ఒడిశాలోని వాణిజ్య, రవాణాశాఖ, కలహండి జిల్లా కలెక్టర్, వర్క్స్ డిపార్ట్‌మెంట్, పోలీసు విభాగాలకు విమానాశ్రయానికి అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేయాలని లేఖలు జారీ చేసింది. ఈ నెలాఖరులోగా ఈ ప్రక్రియ పూర్తి కావాలని అభ్యర్థించింది. ఇదంతా సజావుగా పూర్తయితే.. ఏప్రిల్‌లో ఎప్పుడైనా ఉత్కేళ విమానాశ్రయం నుంచి ప్రయాణికుల విమానాల రవాణా ప్రారంభమయ్యే అవకాశం ఉంది. 2016లో ఉడాన్(ఉడే దేశ్ కీ ఆమ్ నాగరిక్) పథకం కింద భవానీపట్నలో ఉత్కేళ విమానాశ్రయం(ఎయిర్‌స్ట్రిప్) ఏర్పాటుకు ప్రతిపాదించారు.

ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి రూ.5 కోట్లు

- కలెక్టర్ లింగరాజ్ పండా



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ లింగరాజ్ పండా, అధికారులు, సభ్యులు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్‌డీసీ చైర్‌పర్సన్ మరియం రైతో

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రూ.5 కోట్లు కేటాయించిందని జిల్లా కలెక్టర్ లింగరాజ్ పండా వెల్లడించారు. జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాలులో ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి మండలి సమావేశం శనివారం నిర్వహించారు. జిల్లా ఎస్‌డీసీ చైర్‌పర్సన్ మరియం రైతో అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గజపతి జిల్లాలో ఇప్పటికే ప్రతి వెనుకబడిన ప్రాంతానికి రోడ్లు, టెలికాం, రవాణా, తాగునీరు ఇతర మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రస్తుతం ప్రతి సమితి కేంద్రంలో ఆదివాసీల అభ్యున్నతికి చేపలు, పట్టుగొడుగులు పెంపకం, స్వయం ఉపాధి, మిషన్‌శక్తి ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జిల్లాలో 22మంది సభ్యులతో ఎస్‌డీసీ ప్రత్యేక అభివృద్ధి మండలి ఏర్పాటైందని, ఆదివాసీ సమితి కేంద్రాల్లో గిరిజన సంస్కృతి, భాష, విద్య, కళాకారుల ఉన్నతికి చర్యలు చేపట్టాలని సూచించారు. దీనికి సంబందించి గుమ్మా, కాశీనగర్, నువాగడ, రాయగడ, ఆర్.ఉదయగిరి, రామగిరి, మోహానా ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి పథకాలకు ప్రభుత్వం అందజేసిన నిధులను ఖర్చు చేసేందుకు రూపకల్పన చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సమగ్రాభివృద్ధి శాఖ పీడీ ఫాల్గుణి మాఝి, అధికారులు ధనేశ్వర భుయ్యాన్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి మనసులు



- అనాథలకు కడుపు నింపుతున్న మట్టిపాత్రల తయారీ పరిశ్రమ
- ఆదర్శంగా హజ్రత్ ఖాదర్ వలీబాబా ఆశ్రమం
- వసతి, పౌష్టికాహారం, వైద్యం, ఉపాధి... అన్నివిధాలా అండ
- పనిచేయాలనే ఆసక్తి ఉన్నవారికి పరిశ్రమలో ఉపాధి
- మట్టిపాత్రలు, మట్టి ఆధారిత కళాకృతుల ఎగుమతి
- ఏటా రూ.50 లక్షల వరకు ఆదాయం
- పరిశ్రమ సొమ్ముతో అనాథాశ్రమం, నిత్యాన్నదానం నిర్వహణ



పూర్తిగా తయారైన మట్టిపాత్రలుపూర్తిగా తయారైన మట్టిపాత్రలు



మట్టిపూసలు

సండే స్పెషల్

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

అక్కడున్నవారంతా పెద్దవారైన పిల్లలు వదిలించుకున్న తల్లిదండ్రులు! బంధాలు, అనుబంధాలు, ప్రేమలు, అనురాగాలు క్రమేపీ కరువైపోతున్న సమాజంలో ఇలాంటివారికి ఇప్పుడు నీడ కరువవుతోంది. వారు తమ పిల్లలను పెద్దవారిని చేయడానికి చేసిన త్యాగం వృథాఅవుతోంది. జీవిత చరమాంకంలో చేదోడుగా ఉండాల్సిన వారే తమకు తల్లిదండ్రులు భారంగా ఉన్నారంటూ వృద్ధాశ్రమాల్లో చేర్చేస్తున్నారు. అదీ ఇష్టం లేకుంటే గాలికి వదిలేసి తమ దారి చూసుకోమంటున్నారు! జగమంత కుటుంబంలో ఏకాకిగా మిగిలినవారికి ఓ ఆపన్నహస్తం కనిపిస్తోంది. అదే విజయనగరం బాబామెట్ట ఖాదర్‌నగర్‌లోనున్న ఆస్థానా అతా ఇ తాజ్ ఖదారియా (ఏటీకే) వెలుగు అనాథల వృద్ధాశ్రమం. అదొక ఆశ్రమమే కాదు స్వయం ఆధారిత సమ్మేళనం. మట్టిపాత్రల పరిశ్రమను వారి ఆదాయం కోసమే గాకుండా పర్యావరణ హితానికి తమవంతు ప్రయత్నంగా మలచుకున్న వైనం ఆదర్శంగా నిలుస్తోంది.

మట్టి పనితో మనసు హాయి...

తమ పిల్లల నిర్లక్ష్యం, మోసం తట్టుకోలేక ఏటీకే వృద్ధాశ్రమంలో పలువురు తీవ్రమైన మానసిక వేదనకు గురయ్యేవారు. గతాన్ని మరచిపోయి మళ్లీ సాధారణ పరిస్థితికి రావాలంటే ఏదో ఒక వ్యాపకం ఉంటే బాగుంటుందని బాబా మెట్టలోని హజ్రత్ ఖాదర్‌వలీ బాబా దర్గా ధర్మకర్త డాక్టర్ ఖలీలుల్లా షరీఫ్ (ఖలీల్‌బాబు)కు వచ్చిన ఆలోచనకు కార్యరూపమే మట్టిపాత్రల పరిశ్రమ. ఆ మట్టితో మమేకమైన ఆ మనుషుల మనసులు తేలికపడుతున్నాయి. వారి మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతోంది. వారు తయారుచేసిన మట్టిపాత్రలు, మట్టి ఆధారిత వస్తువులు పర్యావరణ హితానికి పరోక్షంగా దోహదపడుతున్నాయి. అలా ఎనిమిదేళ్ల కిందట ప్రారంభమైన మట్టిపాత్రల పరిశ్రమ ఇప్పుడు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకే గాకుండా దేశవిదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగింది.

స్థానిక మహిళలకూ ఉపాధి...

దర్గాకు ఆనుకొనే ఆశ్రమం ఉంది. దాని ఆవరణలోనే మట్టిపాత్రల పరిశ్రమను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆశ్రమంలో వంద మంది వరకూ నీడ పొందుతున్నారు. వారిలో పనిచేయాలనే ఆసక్తి, శక్తి ఉన్న 12 మందితో పాటు మరో 40 మంది స్థానిక మహిళలకు మట్టిపాత్రల పరిశ్రమ ఉపాధి కల్పిస్తోంది. మధ్యాహ్నభోజనం అక్కడే ఉచితంగా అందిస్తున్నారు. పరిశ్రమలో సుమారు 56 రకాల మట్టిపాత్రలు, మట్టిఆధారిత వస్తువులు, అలంకరణ సామగ్రి, జపమాలలు తయారుచేస్తున్నారు. ఏటీకే ముద్రతో తయారవుతున్న మట్టిపాత్రలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ లభిస్తోంది. జపమాలలను మలేసియా, ఇండోనేషియా, గల్ఫ్ దేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

ఆ ఆదాయమే ఆధారంగా...

మట్టిపాత్రల తయారీ పరిశ్రమ ఏటా రూ.50 లక్షల ఆదాయాన్ని అందిస్తోంది. పనివారికి జీతాలు, ముడి సరుకుల ఖర్చులు పోను మిగతా సొమ్ము అంతా ఆశ్రమం నిర్వహణకే వినియోగిస్తున్నారు. మంచి పౌష్టికాహారం అందించడమేగాక వైద్యం చేయిస్తున్నారు.



మట్టి పూసల దండలు

మట్టిపరిశ్రమే మాకు ఆధారం



నా పేరు పాట్నూరు సత్యవతి. మట్టి పాత్రల తయారీ పరిశ్రమలో ఆరేళ్లుగా పని చేస్తున్నాను. నాకు ఇద్దరు పిల్లలు. ప్రస్తుతం డిగ్రీ ఒకరు, ఐటీఐ ఒకరు చదువుతున్నారు. కుటుంబం మొత్తం సేవలోనే ఉంటాం. మట్టిపాత్రలు తయారుచేయడంలో మెలకువలు నేర్చుకున్నాను. రోజూ పనిచేయడంతో కొత్త రకాల పాత్రలు తయారుచేయాలనే ఆలోచన వస్తుంటుంది. ఆ దిశగా ఖలీల్‌బాబు మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. ఈ పరిశ్రమ మాకు ఆధారంగా నిలుస్తోంది.

దేవుడిలా ఆదుకున్నారు...



విజయనగరం రంగరీజువీధిలోనే ఒకప్పుడు ఉండేవాణ్ని. నా పేరు నరసింగరావు. సినిమా షూటింగ్‌లకు డెకరేషన్, ముత్యాల మండపాల తయారీతో పాటు టైలరింగ్ చేసేవాడిని. వృద్ధాప్యంతో ఇక ఆ పని చేయలేకపోతున్నా. ఆశ్రమానికి వచ్చి మూడేళ్లు అయింది. ఖలీల్‌బాబు దేవుడిలా ఆదుకున్నారు.

పనిచేసుకుంటూ జీవనం..



నా పేరు తోలేటి ఈశ్వరమ్మ. మాది పలాస. 20 ఏళ్లకిందట విజయనగరం వచ్చాం. నాకు ఇద్దరు ఆడపిల్లలు. వారికి పెళ్లిళ్లు అయిపోయాయి. నా భర్త చనిపోయిన తర్వాత ఖాదర్ బాబా ఆశ్రమానికి వచ్చేశాను. ఇక్కడే మూడు పూటలా భోజనం, వసతి ఉంటాయి. మట్టి పరిశ్రమలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను.

పిల్లలు దూరమైనా ప్రాణం నిలబడింది



నా పేరు గొడు కోదండరావు. మృదంగం కళాకారుడిని. కళాకారుల సంఘానికి అధ్యక్షుడిగా పనిచేశాను. మా తండ్రి గొడు సింహాద్రి కూడా మృదంగం విద్వాంసులే. నాకు ఇద్దరు అబ్బాయిలు. వారి వృత్తులతో దూరమయ్యారు. ఒంటరినయ్యాను. ఏడాది క్రితం ఆశ్రమానికి వచ్చేశాను. ఇక్కడి వాతావరణం నా ప్రాణాన్ని నిలబెట్టింది.

క్లుప్తంగా

సాంకేతిక విద్యపై అవగాహన



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జి.దామోదర్‌రావు

ఎచ్చెర్ల క్యాంపస్: సాంకేతిక విద్యపై విద్యార్థులకు పూర్తిస్థాయి అవగాహన అవసరమని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జి.దామోదర్‌రావు అన్నారు. కళాశాల మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రోన్ టెక్నాలజీ రెండు రోజుల వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు టెక్నాలజీలో వస్తున్న మార్పులు గమనిస్తూ ఉండాలని, డ్రోన్ల ప్రాధాన్యత ఇప్పుడు పెరుగుతోందని తెలిపారు. అన్ని రంగాల్లోనూ వీటి వినియోగం పెరిగిందని, వ్యవసాయంలో కూడా ఇవి కీలకం కానున్నాయని అన్నారు. విద్యార్థులు డ్రోన్ల పైలెటింగ్, నిర్వహణ, మరమ్మతులు, డిజైన్ వంటి వాటిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ జి.సత్యనారాయణ, అధ్యాపకులు డాక్టర్ యుగంధర్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డీఈఓ పగడాలమ్మ

నరసన్నపేట: టెన్త్ పరీక్షలు సమీపిస్తుండటంతో విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఈఓ జి.పగడాలమ్మ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆమె శనివారం ఉదయం తనిఖీ చేశారు. 9 గంటలకే స్కూల్‌కు చేరుకున్న ఆమె ఉపాధ్యాయుల హాజరు గమనించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఆరోగ్యం చూసుకోవాలని, మంచి ఆహారం తీసుకోవాలని, ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని కోరారు. స్కూల్లో ఉపాధ్యాయులు ఎలా బోధిస్తున్నారో పిల్లలను అడిగి తెలుసుకున్నారు. అలాగే 8వ తరగతి విద్యార్థుల ట్యాబ్‌ల వినియోగాన్ని పరిశీలించారు.

21న నారాయణవలస సంత వేలం

కోటబొమ్మాళి: ఈ నెల 21న మంగళవారం ఉదయం 11 గంటలకు నారాయణవలస పశువుల సంతకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.ఫణీంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసేందుకు పూర్తి వివరాల కోసం తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

సజావుగా ఇంటర్ పరీక్షలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు సాఫీగా సాగుతున్నాయి. శనివారంతో లాంగ్వేజ్ పేపర్ల పరీక్షలు ముగిసినట్టయింది. సోమవారం నుంచి గ్రూపు సబ్జెక్టులకు పరీక్షలు మొదలుకానున్నాయి. 20వ తేదీన ప్రథమ సంవత్సరం విద్యార్థులు మ్యాథ్స్-1(ఎ), సివిక్స్, బోటనీ పేపర్-1కు పరీక్షలు రాయనున్నారు. ఇంటర్ పరీక్షల్లో భాగంగా నాల్గో రోజు శనివారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సెట్-2 ప్రశ్న పత్రంతో ఇంగ్లిష్ పేపర్-2 పేపర్‌కు పరీక్ష రాశారు. జిల్లా వ్యాప్తంగా 109 పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్న పరీక్షల్లో భాగంగా శనివారం మొత్తం 26,139 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా (97.09 శాతం హాజరు) 25,379 మంది పరీక్ష రాశారు. వివిధ కారణాలతో 760 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 23,626 మందికి 663, ఒకేషనల్ విభాగంలో 1850 మందికి 97 మంది విద్యార్థులు పరీక్షకు డుమ్మా కొట్టారు. శనివారం ఎలాంటి మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదుకాలేదని జిల్లా ఆర్‌ఐఓ ఎస్.తవిటినాయుడు స్పష్టం చేశారు. అధికారుల జిల్లా వ్యాప్తంగా జోరుగా తనిఖీలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కంచిలి: మండలంలోని జాడుపూడి కాలనీ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపిన వివరాల మేరకు.. జాడుపూడికి చెందిన డొప్ప నరేష్ తన గ్రామం నుంచి స్టేషన్ వైపు ద్విచక్రవాహనంతో వెళుతూ.. జాడుపూడి స్టేషన్ నుంచి స్వగ్రామం గొల్లపుట్టుగకు స్కూటీ నడుపుకొంటూ వస్తున్న మురపాల మోహనరావును బలంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఇద్దరికీ గాయాలయ్యాయి. ఇద్దర్నీ సోంపేట ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి ప్రథమ చికిత్స అందించారు. మోహనరావు పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీకాకుళం తరలించారు. మోహనరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ఫైర్‌సర్వీస్ డీజీ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఏపీ రాష్ట్ర ఫైర్ సర్వీస్ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్ శనివారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఊరు.. కన్నతల్లి తీరు!



- ఆత్మీయతకు పెట్టింది పేరు ఉద్దానం
- కళాకారుల నుంచి ఉద్యోగుల వరకు అందరికీ సమున్నత గౌరవం
- ఉద్దానంలో అతిథి మర్యాదలు మరువలేమంటున్న అధికారులు

గోదావరి నాసిక్‌లో పుడితే.. మర్యాదలు గోదారిలో పుట్టాయని అంటుంటారు. ఆ మాటకొస్తే గోదారే కాదు మన ఉద్దానం దారుల్లో తిరిగినా అవే మర్యాదమన్నలు దొరుకుతాయి. ఇది జనం మాట మాత్రమే కాదు.. ఇక్కడ పనిచేసిన అధికార గణం మాట కూడా. ఓ కళాకారుడు ఊరికి వస్తే.. అతని మనసు నిండిపోయేలా సత్కరించడం.. ఓ అధికారి విధి నిర్వహణపై వస్తే పని పూర్తయ్యే వరకు గౌరవంగా పలకరించి ఆదరించడం.. ఓ ఉద్యోగి ఊరిలో నివాసం ఉంటే అప్పుడిలా చూసుకోవడం.. ఉద్దానం ఊళ్లకు పుట్టుకతో వచ్చిన లక్షణం. మనుషులను గౌరవించడం, అతిథులను బాగా చూసుకోవడం సగటు సిక్కోలువానికి అలవాటు. ఉద్దానంలో ఆ అలవాటు మరికాసింత ఎక్కువ.

కవిటి :

పండగ పూట ఓ కళాకారిణి వచ్చి ఉద్దానంలో పాట పాడిందంటే ఆమె ఆ ఊరి ఆడపడుచు అయిపోవాల్సిందే. కొత్తగా ఒక టీచర్ ఊరిలో కాపురం పెడితే.. మనిషి తెలిసినా తెలియకపోయినా అన్ని శుభలేఖలూ ఆ ఇంటికి వెళ్లాల్సిందే. ఇక్కడి పనస పొట్టు కూర తినకుండా.. పనస తొనల రుచి చూడకుండా.. ఉద్దానం కొబ్బరి నీటితో కడుపు నింపుకోకుండా ఏ అతిథీ బయటకు వెళ్లడు. ఉద్దానం అతిథి గౌరవాలు లోకప్రసిద్ధి. సాధారణంగా జిల్లా చివర ఉద్యోగం చేయాలంటే.. చాలా మంది సంశయిస్తూ ఉంటారు. కానీ ఉద్దానంలో నివాసం ఉండి.. ఇక్కడి ఊరి తీరుతెన్నులు అర్థం చేసుకున్న వారు బతుకంతా ఇక్కడి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఉంటారు.

చిక్కటి మజ్జిగ, చల్లచల్లని కొబ్బరి నీరుతో పలకరించడం కడుపుతోపాటు మనసు నిండిపోయేలా భోజనం పెట్టడం మన పల్లెల ప్రత్యేకత. తమ తోటల్లో పండే పనస, మామిడి, జీడిపిక్కలు, అరటి గెలలు, కొబ్బరికురిడీలు, మునగ వంటివి అతిథులకు ఇచ్చి సాగనంపడం వచ్చిన వారి మనసు దోచుకుంటాయి. ఈ ప్రాంతంలో పనిచేసేవారు ఉద్యోగులుగానే ఉండిపోరు.. చాలా కుటుంబాలకు సొంత మనుషులుగా మారిపోతారు. ప్రతి శుభకార్యానికి ప్రత్యేక ఆహ్వానం ఉంటుంది. ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన తర్వాత కూడా వారితో సంబంధ బాంధవ్యాలు సజీవంగా ఉంటాయి.

సండే స్పెషల్



జగతిలో పూడి సత్యనారాయణ కుటుంబంలో అతిథులతో సహపంక్తి భోజనాలు చేస్తున్న దృశ్యం

మళ్లీ వెళ్లాలనిపిస్తోంది..



ఉద్దానంలో నేరాల రేటు చాలా తక్కువ. నేను కవిటిలో పనిచేస్తున్నప్పుడు టైఫాయిడ్ వచ్చింది. అప్పుడు ఇక్కడి వారు నాపై చూపిన ఆదరణ అభిమానం మరువలేనిది. సొంత కుటుంబ సభ్యులు చూసుకున్నట్లు నన్ను చూసుకున్నారు. నా సర్వీసులో ఇలాంటి ప్రజలను ఎక్కడా చూడలేదు. వీరి అభిమానం వెలకట్టలేనిది. మళ్లీ వెళ్లాలనిపిస్తూ ఉంటుంది.

– కె.వాసునారాయణ, ఏసీబీ ఎస్ఐ, విజయనగరం.

నా సొంతూరులో లేని పరపతి..



నేను స్కూల్‌అసిస్టెంట్ నుంచి హెచ్‌ఎంగా కవిటి మండలం ముత్యాలపేటలో జాయిన్ అయ్యాను. తొలుత రెండు నెలలు నేను కుటుంబాన్ని అక్కడకు తీసుకురాలేకపోవడంతో ఒంటరిగా ఉండేవాడిని. ఆ రోజుల్లో మూడుపూటలా మా ఇంట్లో భోజనం చేయండి లేకుంటే క్యారియర్ పంపిస్తాం అని చాలా మంది అన్నారు. ఇక్కడ నాకు దక్కిన ఆదరణ, అభిమానం ఇంకెక్కడా దొరకలేదు.

– డి.కృష్ణారావు, హెడ్మాస్టర్, మందరాడ.

ఆడపడుచులా ఆదరణ..



పుట్టింటికి వచ్చిన ఆడబిడ్డను ఏ రీతిన పలకరిస్తారో ఉద్దానంలో నన్ను అలాగే చూసుకున్నారు. 25 ఏళ్లుగా ఈ ప్రాంతంలో నేను హరికథలు చెప్పడానికి వస్తున్నాను. ఇక్కడ ఇచ్చే గౌరవం ఇంకెక్కడా దొరకదు. పసుపు కుంకుమలు, చీరగాజులు పెట్టి ఏటా నన్ను సత్కరిస్తుంటారు.

– సప్ప భారతి, హరికథా భాగవతారిణి, ఏలూరు.

చేతులు జోడిస్తారు..



సీహెచ్.కోటేశ్వరరావు తల్లిదండ్రులతో కలిపి సత్కరిస్తున్న దొంకపుట్టుగ గ్రామస్తులు

నేను 2010లో దొంకపుట్టుగలో టీచర్‌గా జాయిన్ అయ్యాను. ఇక్కడ చిన్నవారి నుంచి పెద్ద వారి వరకు అంతా టీచర్ కనిపిస్తే రెండు చేతులు జోడించి నమస్కారం పెడతారు. చాలా మంది ఈ పద్ధతి మర్చిపోయారు. ఉద్దానం మాత్రమే ఇంకా గుర్తు పెట్టుకుంది. ఇక్కడ ఆరేళ్లు పనిచేసి వెళ్లిపోయాక కూడా..నన్ను మా అమ్మను పిలిచి బంగారు ఆభరణాలు ఇచ్చి సత్కరించారు. అమ్మకు పసుపు కుంకుమ చీర పెట్టారు.

కష్టాల్లోనూ..



సహజంగా ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు ఎవరి ప్రాణాలు వారు కాపాడుకుంటారు. కానీ ఇటీవల తుఫాన్ సందర్భంలో నేను ప్రత్యేకాధికారిగా వెళ్తే ఇళ్లకు పిలిచి భోజనాలు పెట్టారు. ఇది నన్ను కట్టి పడేసింది. ఓ అధికారిని ఇంతలా అక్కున చేర్చుకోవడం ఇక్కడ రైతులకు తెలిసినంతగా మరో చోట కనిపించదు. కోనసీమలా రూపు మాత్రమే కాదు తీరు కూడా ఉంటుంది.

– హెచ్‌వీ జయరాం, కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, విశాఖపట్నం.

ఎన్ని మర్యాదలో..



నేను 35 ఏళ్ల కిందట కవిటిలో ఓ కచేరీ కోసం వచ్చాను. మమ్మల్ని భారీగా స్వాగతించడం, గౌరవంగా వీడ్కోలు పలకడం ఇంకా గుర్తుంది. ఇక్కడ ఉన్న రెండు రోజులు పనస తొనలు, మామిడి పళ్లు, లేతకొబ్బరినీళ్లు, పట్టు తేనె, జీడిపప్పు వంటి వాటితో రుచికరమైన జ్ఞాపకాలు పంచారు.

– మోదుమూడి సుధాకర్, మ్యూజిక్ ప్రొడ్యూసర్, ఆల్ ఇండియారేడియో, విజయవాడ.

ఇక్కడోసారి తిరగాలి..



పాతికేళ్లుగా ఉద్దానంలో తిరుగాడుతున్నాను. మర్యాదమన్ననలకు ఉద్దానం ఊళ్లు పెట్టింది పేరు. ఎవరికైనా సందేహం ఉంటే ఇక్కడ ఓ సారి తిరగాలి.

– కేకేఎల్ స్వామి, జాతీయ స్థాయి నాటక దర్శకుడు, రచయిత, గరివిడి, విజయనగరం జిల్లా



ఉద్యానవన మండల కేంద్రం కవిటి బస్టాండ్

రూ.20 లక్షల విలువైన 150 ఫోన్లు రికవరీ



పోలీసులు రికవరీ చేసిన మొబైల్స్

- బాధితులకు అందజేసిన ఎస్పీ రాధిక
- ఫోన్ పోగొట్టుకుంటే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చని వెల్లడి

శ్రీకాకుళం క్రైమ్ : స్మార్ట్ ఫోన్ పోగొట్టుకుంటే ఆన్‌లైన్‌లో లాస్ట్ మొబైల్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. రూ. 20 లక్షల విలువైన 150 మొబైల్ ఫోన్లను జిల్లా పోలీస్ శాఖ ఐటీ కోర్ టీమ్ రూపకల్పన చేసిన లాస్ట్ మొబైల్ ట్రాకింగ్ సిస్టమ్ ద్వా రికవరీ చేసి బాధితులకు శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ చేతుల మీదుగా ఫోన్లు అందజేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మొబైల్స్ పోగొట్టుకున్న బాధితులు 'హెచ్‌టీపీపీ శ్రీకాకుళంపోలీస్.ఇన్ మొబైల్ ట్రాక్ అప్‌లోడ్' అధికార వెబ్‌సైట్‌లో ఫోన్ ఐఎంఈఐ వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అందులో జిల్లా సైబర్ సిబ్బంది 150 ఫోన్లను గుర్తించారు. ఈ సందర్భంగా ఎస్పీ రాధిక మాట్లాడుతూ మొబైల్ ఫోన్లో సెక్యూరిటీ లాక్ లేకుండా ఎటువంటి సమాచారాన్ని ఉంచరాదని, క్రెడిట్ కార్డు, ఏటీఎం పిన్ నంబర్లు, నెట్ బ్యాంకింగ్‌లకు భద్రతాపరమైన లాకింగ్ వేసుకోవాలన్నారు. చోరీ చేసిన ఫోన్లను తక్కువ ధరలకు ఇతరులకు అమ్మివేస్తారని, ఇలాంటి వాటిని మన జిల్లా, రాష్ట్రం, దేశం నుంచే కాక ఇతర దేశాల నుంచి రికవరీ చేశామన్నారు. మొబైల్ ఫోన్లు పోయిన వెంటనే వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకుంటే తక్కువ కాలంలోనే ఫోన్లు రికవరీ చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. గతంలో రూ. 12.50 లక్షల విలువైన 130 మొబైల్ ఫోన్లను అందజేశామని, ఇప్పటివరకు రూ. 32.50 లక్షల విలువైన 280 ఫోన్లను బాధితులకు అందజేశామని వివరించారు. మిగతా ఫోన్లు కూడా వీలైనంత త్వరగా రికవరీ చేసి బాధితులకు అందజేస్తామని చెప్పారు. సరైన పత్రాలు లేకుండా మొబైల్ ఫోన్లను బయట కొనవద్దని ఎస్పీ సూచించారు. ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబర్చిన సైబర్ సెల్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ టి.పి. విఠలేశ్వరరావు, ఎస్ఐ ప్రసాదరావు, ఏఎస్ఐ బి.రమేష్ సైబర్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.



బాధితులకు మొబైల్స్ అందజేస్తున్న ఎస్పీ

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి

పోలాకి: మండలంలోని కింజరాపుపేట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దీర్ఘాశి గ్రామానికి చెందిన శిర్ల తమ్మయ్య(70) అనే వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. కొత్తరేవుకు చెందిన మైలపల్లి కృష్ణ పోలాకి-నరసన్నపేట రోడ్డుపై బైక్‌పై వెళ్తుండగా కింజరాపుపేట వద్ద అకస్మాత్తుగా సైకిల్‌పై తమ్మయ్య ప్రధాన రహదారిపైకి రావటంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. తీవ్ర గాయాలైన తమ్మయ్యను ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతిచెందాడు. ఎస్ఐ నర్సింహమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు వలస కూలీ మృత్యువాత

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు మండలం బైపల్లి గ్రామానికి చెందిన వలస కూలీ మడ్డు భాస్కరరావు(46) విశాఖపట్నంలో ప్రమాదవశాత్తు శనివారం మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. భాస్కరరావు తన భార్య కల్పన, ఇద్దరు పిల్లలతో కలిసి కూలీ పనుల కోసం కొన్నాళ్ల కిందట విశాఖపట్నం వెళ్లాడు. పెయింటింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం ఓ భవనానికి రంగులు వేస్తుండగా ప్రమాదం జరగడంతో మృత్యువాత పడ్డాడు. విషయం తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

టెక్కలి: మేజర్ పంచాయతీ పరిధిలోని అంజనాపురంలో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి ముడిదాన జంగమయ్య ఇంట్లో సామగ్రి దగ్ధమయ్యాయి. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో వస్తువులన్నీ కాలిపోయాయి. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆట్ల రాహుల్, వార్డు సభ్యుడు టి.లోకేష్ ఘటనా స్థలానికి చేరుకుని వీఆర్‌ఓ నాగరాజుకు సమాచారం అందజేశారు. బాధితులకు తమవంతు సాయం చేస్తామని హామీ ఇచ్చారు.

వేసవి జాగ్రత్తలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం వేసవి వడగాడ్పులు, వడదెబ్బ, ముందస్తు జాగ్రత్త చర్యలపై కలెక్టర్‌తో పాటు జేసీ ఎం.నవీన్ జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న రెండు నెలల పాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓల ఆధ్వర్యంలో అన్ని మండలాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయించాలని జెడ్పీ సీఈఓ వెంకట్రామన్‌ను ఆదేశించారు. వడగాలులపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ప్రతి పెట్రోల్ బంక్ వద్ద తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి పనుల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలన్నారు. పని వేళలు కూడా మార్చాలన్నారు. తాగునీటి ఎద్దడి రాకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బడుల్లో ప్రతి రెండు గంటలకు బెల్ కొట్టి నీరు తాగేలా చేయాలన్నారు. అడవుల్లోనూ నీటి తొట్టెలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి నిశాకుమారి, నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.మీనాక్షి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారి విద్యాసాగర్, డ్వామా పీడీ చిట్టిరాజు, డీపీఆర్‌ఓ కె.బాలమాన్‌సింగ్, వ్యవసాయ, డీఆర్‌డీఏ, ఫిషరీస్, పశుసంవర్ధక శాఖ, ఫైర్, పోలీసు అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు క్లినిక్‌లో పనేంటి?



రోగుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

టెక్కలి: ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది విధులకు సెలవులు పెట్టి ప్రైవేట్ క్లినిక్‌లో ఎలా ఉంటున్నారని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి వైద్య సిబ్బందిని నిలదీశారు. టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఇటీవల నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో లేవనెత్తిన సమస్యలు ఎంత వరకు పరిష్కారమయ్యాయనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రసూతి వైద్య నిపుణురాలు ధనలక్ష్మి విధులకు హాజరుకాకపోవడాన్ని ప్రస్తావిస్తూ ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బంది విధులకు సెలవులు పెట్టి ప్రైవేట్ క్లినిక్‌లో ఎలా ఉంటున్నారని ప్రశ్నించారు. ఇకపై వైద్య సిబ్బందికి సెలవు కావాలంటే జిల్లా అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. సుదీర్ఘంగా సెలవుల్లో ఉన్నవారి స్థానంలో కొత్త వారిని నియమించేలా చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ బి.సూర్యరావు, ఆర్ఎంఓ శ్రీరాములు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ప్రైవేటు స్కూల్ బస్సు



పొలాల్లోకి దూసుకెళ్లిన స్కూల్‌బస్సు

- చిన్నారులకు త్రుటిలో తప్పిన పెను ప్రమాదం
- డ్రైవర్‌నిర్లక్ష్యం కారణంగా గుర్తించి కేసు నమోదు

పోలాకి: మండలంలోని ప్రియాగ్రహారం వద్ద శనివారం ప్రైవేట్ స్కూల్ బస్సు అదుపుతప్పిన ఘటనలో చిన్నారులకు త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసన్నపేటలోని సెయింట్ క్లారెట్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌కు చెందిన బస్సు 40 మంది విద్యార్థులతో పిన్నింటిపేట, నిమ్మాడ మీదుగా పాఠశాలకు వస్తుండగా ఆటోను ఓవర్ ట్రాక్ చేస్తూ ఒక్కసారిగా రోడ్డుపక్కనే ఉన్న వేరుశనగ పొలంలోకి దూసుకుపోయింది. దీంతో పిల్లలంతా భయాందోళనకు గురయ్యారు. రోడ్డుకు సమానంగా పొలం ఉండటంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే బస్సులో ఉన్న చిన్నారులను వేరే బస్సులో నరసన్నపేట తరలించారు. చిన్నారుల క్యారియర్‌లు, బ్యాగులు ప్రమాదం జరిగిన బస్సులోనే చెల్లాచెదురుగా ఉండటాన్ని గమనించిన కొందరు తల్లిదండ్రులు సిబ్బందిని ప్రశ్నించారు. వారు సరైన సమాధానం చెప్పలేకపోవటంతో బస్సు అద్దాలు ధ్వంసంచేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని చేరుకుని సమీక్షించారు. డ్రైవర్ కోటేశ్వరరావు నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసినందుకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ నర్సింహమూర్తి తెలిపారు.

ఆరాతీసిన ఎమ్మెల్యే కృష్ణదాస్..

స్కూల్ బస్సు ప్రమాదానికి గురైందని సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఘటనపై ఆరాతీశారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరైన ఆయన స్థానిక నాయకులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణం పాఠశాలకు వెళ్లి విద్యార్థుల గురించి తెలుసుకోవాలని ఆదేశించారు. పోలాకి మండల పరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు పాఠశాలకు వెళ్లి చిన్నారులతో మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు.



ఘటనా స్థలం వద్ద వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఆమదాలవలస రోడ్డు విస్తరణకు..

లైన్ క్లియర్

- విద్యుత్ స్తంభాల మార్పు పనులకు టెండర్ ఖరారు
- రూ.7.34 కోట్లతో పనులు ప్రారంభించనున్న విద్యుత్ శాఖ



ఆమదాలవలస రహదారికి ఇరువైపులా తొలగించనున్న విద్యుత్ స్తంభాలు ఇవే..


అరసవల్లి:

శ్రీకాకుళం– ఆమదాలవలస రహదారి నాలుగు లైన్ల విస్తరణ పనులు ఊపందుకోనున్నాయి. కళింగపట్నం–పార్వతీపురం (సీఎస్‌సీ రోడ్డు) రాష్ట్ర రహదారిలో భాగమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఆమదాలవలస బ్రిడ్జి ముందు వరకు సుమారు 10.4 కిలోమీటర్ల మేర రహదారిని రూ.40 కోట్లతో విస్తరించేందుకు గతేడాది రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విస్తరణ పనులు ప్రారంభించినప్పటికీ విద్యుత్ స్తంభాలు ఇరువైపులా ఉండిపోవడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. చెట్ల తొలగింపు పనులు పూర్తి చేసినా విద్యుత్ శాఖ పనులకు టెండర్ ప్రక్రియ ఖరారు కాకపోవడంతో విస్తరణకు బ్రేక్ పడింది. తాజాగా విద్యుత్ శాఖ పరంగా టెండర్ పనులు ఖరారు కావడంతో ఎట్టకేలకు క్లియరెన్స్ దొరికింది. విద్యుత్ స్తంభాల తొలగింపు, కొత్త స్తంభాల ఏర్పాటు పనుల టెండర్ ప్రక్రియ తాజాగా ఖరారైంది. ఈ మేరకు ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్ల అగ్రిమెంట్ల ప్రక్రియ పూర్తయ్యింది.

రూ.7.34 కోట్లతో విద్యుత్ పనులు..

జిల్లా కేంద్రం నుంచి ఆమదాలవలస బ్రిడ్జి వరకు ఇరువైపులా విద్యుత్ స్తంభాల తొలిగింపు, కొత్తగా ఏర్పాటు పనులకు విద్యుత్ శాఖ రూ.7.34 కోట్లతో పనులకు ఆన్‌లైన్ టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్లు కుదుర్చుకున్నారు. మొత్తం 10.4 కిలోమీటర్ల రహదారిలో 400పైగా విద్యుత్ స్తంభాలు, 60 వరకు ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించాల్సి ఉంది. మూడు భాగాలుగా పనిని విభజించి పనులు వేగంగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టారు. అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం, రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావుల జోక్యంతో ఈ పనులకు గ్రీన్ సిగ్నల్ వచ్చిందని చెప్పాలి. త్వరితగతిన విస్తరణ పనులు పూర్తయితే..శ్రీకాకుళం, ఆమదాలవలస నియోజకవర్గాల అభివృద్ధికి దోహదపడుతుంది.

రెండు మూడు రోజుల్లో పనులు..



విద్యుత్ స్తంభాల తొలగింపు, కొత్తగా ఏర్పాటు పనులకు ఎస్ఈ దైవప్రసాద్ సమక్షంలో కాంట్రాక్టర్లకు అగ్రిమెంట్లు ఇచ్చేశాం. రెండు మూడు రోజుల తర్వాత పనులు ప్రారంభం కానున్నాయి.

– ఎస్.బయ్యన్నాయుడు, శ్రీకాకుళం డివిజన్ ఈఈ